
సాక్షి
శ్రీపొట్టి శ్రీరాములు నెల్లూరు
బుధవారం ׀ 21 ׀ జూన్ ׀ 2023



సోమశిలలో నీటి నిల్వ
చేజర్ల(సోమశిల): సోమశిల జలాశయంలో మంగళవారం సాయంత్రానికి 33.093 టీఎంసీల నీరు నిల్వ ఉంది. జలాశయంలో 92.428 మీటర్ల నీటిమట్టం నమోదైంది.



బంగారం ధరలు
24 క్యారెట్లు (10 గ్రాములు) - రూ.61,230
22 క్యారెట్లు ఆర్నమెంట్ (గ్రా)- రూ.5,499
3 శాతం జీఎస్టీతో.. - రూ.5,664
నవర (8 గ్రా) - రూ.45,312


వాతావరణం
గరిష్టం/కనిష్టం
39.5 /29.0

మంగళవారం గాలిలో తేమ 42 శాతం ఉంది. బుధవారం వాతావరణంలో మార్పులు ఉంటాయి. ఉష్ణోగ్రతలు తగ్గే అవకాశం ఉందని అధికారులు తెలిపారు.

పైసలిస్తే పర్మిషన్

- ఒకదానికి అనుమతి తీసుకుని మరొకటి నిర్మాణం
- రోడ్లు, వీధులు ఆక్రమించి ఇష్టానుసారంగా నిర్మిస్తున్న భవనాలు
- టౌన్‌ప్లానింగ్ అధికారుల తీరుపై అడిగే వారు కరువు
- లంచాలు ఇస్తేనే అనుమతులు
- లేకుంటే ఏదో ఒక నెపంతో కొర్రీలు
- ప్రభుత్వ ఆదాయానికి గండి
- నెల్లూరు నగరపాలక సంస్థలో ఇదీ పరిస్థితి

ఇక్కడ డబ్బులిస్తే చాలు ఏ అనుమతైనా పొందొచ్చు. నివాసానికి పర్మిషన్ తీసుకుని ఏకంగా వ్యాపార భవంతినే నిర్మించొచ్చు. ఒక అంతస్తుకు అనుమతి పొంది ఐదు అంతస్తులు కట్టొచ్చు. నెల్లూరు నగరంలో చేపట్టిన భవన నిర్మాణాల్లో నిబంధనలు ఉల్లంఘించినా, ఎన్ని జిమ్మిక్కులు చేసినా అడిగేవారు లేరు. నెల్లూరు నగరపాలక సంస్థలోని టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులకు అడిగినంత ఇస్తే చాలు ఏకంగా ఎంత భవంతినైనా నిర్మించవచ్చని తెలుస్తోంది. అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా టౌన్‌ప్లానింగ్ అధికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి.



నెల్లూరు(బారకాసు): శరవేగంగా అభివృద్ధి చెందుతున్న నెల్లూరు నగరంలో నానాటికీ జనాభా పెరుగుతూనే ఉంది. నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో మొత్తం 54 డివిజన్లు ఉండగా, దాదాపు 8 లక్షల మందికి పైగా ప్రజలు నివసిస్తున్నారు. అపార్ట్‌మెంట్లు, భవన నిర్మాణాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయి. వ్యాపారాల నిమిత్తం పెద్ద పెద్ద షోరూంలు వెలుస్తున్నాయి. అయితే వీటి నిర్మాణాలు ప్రభుత్వ నియమ నిబంధనల మేరకు జరగాల్సి ఉంది. కానీ పరిస్థితి అందుకు భిన్నంగా ఉన్నట్లు తెలుస్తోంది.

అక్రమ నిర్మాణాలు జరుగుతున్నా..

నెల్లూరు నగరపాలక సంస్థ పరిధిలో ఒక భవనాన్నో, అపార్ట్‌మెంట్‌నో, షోరూంనో నిర్మించాలంటే కార్పొరేషన్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి ప్లాన్ అప్రూవల్ తీసుకోవాల్సి ఉంది. అయితే కొంతమంది టౌన్‌ప్లానింగ్ విభాగం నుంచి ఒక దానికి అనుమతి తీసుకుని మరొకటి నిర్మిస్తున్నట్లు తెలుస్తోంది. ఇలా నగరంలోని అనేక ప్రాంతాల్లో అక్రమ నిర్మాణాలు జరుగుతున్నాయి. అయినా తమకేమీ పట్టనట్టుగా టౌన్‌ప్లానింగ్ అధికారులు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టౌన్‌ప్లానింగ్ అధికారుల అవినీతి, అక్రమాలకు పాల్పడడం వల్ల ఇటీవల నగరంలోని అనేక చోట్ల రోడ్లు, వీధులను సైతం కొందరు ఆక్రమించి తమకు ఇష్టం వచ్చినట్లు భవనాలు నిర్మిస్తున్నారని, దీంతో రోడ్ల వెడల్పు తగ్గిపోయి వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలుగుతున్నాయని ఏకంగా కార్పొరేషన్ కోఆప్షన్ సభ్యుడు నూనె మల్లికార్జున పలుమార్లు కమిషనర్ వికాస్‌మర్మత్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు.

తమకేమీ పట్టనట్లుగా..

నగరంలోని విజయమహల్‌గేట్ సమీపంలో ఓ బహుళ అంతస్తుల భవన నిర్మాణం చేపట్టారు. ఈ భవన నిర్మాణ యజమాని టౌన్‌ప్లానింగ్ విభాగంలో తనకు ఇంటి భవన నిర్మాణం కోసం అనుమతి ఇవ్వాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా సంబంధిత విభాగం అధికారులు అనుమతి ఇచ్చారు. అయితే సదరు భవన యజమాని నిబంధనలకు విరుద్ధంగా ఇంటి భవనం కాకుండా కమర్షియల్(వ్యాపార) బహుళ అంతస్తుల భవన నిర్మాణాన్ని చేపట్టారు. ఈ విషయం టౌన్‌ప్లానింగ్ అధికారులకు తెలిసినా తమకేమీ పట్టనట్లుగా వ్యవహరిస్తున్నారని పలువురు ఆరోపిస్తున్నారు. ఇందుకు కారణం టౌన్‌ప్లానింగ్ అధికారులకు సదరు భవన యజమాని నుంచి అధిక మొత్తంలో ముడుపులు అందినట్లు తెలుస్తోంది.

అనుమతి తీసుకున్న దానికి భిన్నంగా..

అలాగే నగరంలోని మినీబైపాస్ రోడ్డులో ఓ యజమాని జి+2కు అనుమతి తీసుకుని ప్రస్తుతం నాలుగు అంతస్తుల భవనం నిర్మించారు. అనుమతి తీసుకున్న దానికి భిన్నంగా బహుళ అంతస్తుల భవనాన్ని నిర్మించారు. అంతేకాకుండా గ్రౌండ్‌ఫ్లోర్‌లో కారుపార్కింగ్ అని ప్లానింగ్‌లో చూపారు. అయితే గ్రౌండ్‌ఫ్లోర్‌లో కూడా కన్‌స్ట్రక్షన్ చేసి ఉండడం గమనార్హం. ఇలా నగరంలోని అనేక చోట్ల భవన నిర్మాణాలు నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్నప్పటికీ పట్టించుకునేవారు కరువయ్యారు.

నిబంధనలకు విరుద్ధంగా..

ఇదేవిధంగా నగరంలోని పలు ప్రాంతాల్లో బహుళ అంతస్తుల భవనాల నిర్మాణాలు జరుగుతున్నాయి. వీటిలో కొన్ని నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తున్నారని సమాచారం. అయితే టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు వీటివైపు కనీసం కన్నెత్తి చూడడం లేదని తెలుస్తోంది. ఇలా సంబంధిత అధికారులు అవినీతికి పాల్పడడం, నిర్లక్ష్యంగా వ్యవహరించడం వల్ల ప్రభుత్వ ఆదాయానికి గండిపడుతోంది. గతంలో టౌన్‌ప్లానింగ్ విభాగం అధికారులు అవినీతికి పాల్పడడంతోనే నగరం నడిబొడ్డున గాంధీబొమ్మసెంటర్ నుంచి కాపువీధి మీదుగా మండపాలవీధి, గిడ్డంగివీధి, చిన్నబజార్, పెద్దబజార్, ఫత్తేఖాన్‌పేట, రంగనాయకులపేట సమీపంలోని గొల్లవీధి తదితర ప్రాంతాల్లో నిబంధనలకు విరుద్ధంగా బహుళ అంతస్తుల భవనాల నిర్మాణం జరిగిందని తెలుస్తోంది. ఆయా ప్రాంతాల్లో కేవలం ద్విచక్రవాహనాలు వెళ్లేందుకు మాత్రమే అవకాశం ఉంది. ఈ విధంగా నిర్మాణాలు చేపడితే ఏదైనా అగ్ని ప్రమాదం జరిగితే పరిస్థితి ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

సిబ్బంది చేతివాటం
నగరపాలక సంస్థ పరిధిలో నిబంధనలకు విరుద్ధంగా అనేక భవన నిర్మాణాలు జరుగుతున్నా 167 సచివాలయాల్లోని ప్లానింగ్ సెక్రటరీలు, కార్పొరేషన్ కార్యాలయంలోని టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది ఏంచేస్తున్నారో అర్థం కాని పరిస్థితి. ఇటీవల నెల్లూరు నగరపాలక సంస్థ కమిషనర్‌గా వికాస్‌మర్మత్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి నిత్యం నగరంలో పర్యటిస్తూ నగరాభివృద్ధికి కృషి చేస్తుంటే మరోవైపు టౌన్‌ప్లానింగ్ అధికారులు, సిబ్బంది తమ చేతివాటాన్ని ప్రదర్శిస్తూ జేబులు నింపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇకనైనా నగరంలో అక్రమ నిర్మాణాలపై కమిషనర్ దృష్టి సారించి తగు చర్యలు చేపట్టాలని పలువురు కోరుతున్నారు.

పరిశీలించి చర్యలు తీసుకుంటాం


నగరపాలక సంస్థ పరిధిలో నియమ నిబంధనలు అతిక్రమించి ఎవరైనా భవనాలు నిర్మిస్తుంటే వాటిని పరిశీలించి చర్యలు తీసుకుంటాం. ఇంటి నిర్మాణం కోసం అనుమతి తీసుకుని కమర్షియల్ భవనం నిర్మిస్తున్నారనే విషయం నాదృష్టికి రాలేదు. నిబంధనలకు విరుద్ధంగా నిర్మిస్తుంటే తగు చర్యలు తీసుకుంటాం.
– వికాస్‌మర్మత్, కమిషనర్, నగర పాలక సంస్థ, నెల్లూరు

న్యూస్‌రీల్

పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్


కౌన్సెలింగ్ నిర్వహిస్తున్న డీపీఓ సుస్మితారెడ్డి

నెల్లూరు(పొగతోట): పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ నిబంధనల ప్రకారం చేపడుతున్నామని డీపీఓ సుస్మితారెడ్డి తెలిపారు. జెడ్పీ సమావేశ మందిరంలో మంగళవారం గ్రేడ్-5, గ్రేడ్-6 పంచాయతీ కార్యదర్శుల బదిలీల కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా డీపీఓ మాట్లాడుతూ సచివాలయాల్లో పనిచేస్తున్న పంచాయతీ కార్యదర్శుల నుంచి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరించి కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని తెలిపారు. నిబంధనల మేరకు బదిలీల ప్రక్రియ పూర్తిచేస్తామని తెలిపారు.

రక్తదానం మహాదానం
- పోర్టు సీఈఓ జీజే రావు


రక్తదాన శిబిరాన్ని పరిశీలిస్తున్న పోర్టు సీఈఓ జీజే రావు తదితరులు

ముత్తుకూరు: రక్తదానం మహాదానమని అదానీ కృష్ణపట్నం పోర్టు సీఈఓ జీజే రావు అన్నారు. రెడ్‌క్రాస్ సహకారంతో పోర్టులో మంగళవారం జరిగిన మెగా వైద్యశిబిరాన్ని సీఈఓ, రక్తదాన శిబిరాన్ని సీఓఓ సంజయ్ పరిశీలించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ రక్తదానం చేయడమంటే మరొకరి ప్రాణం కాపాడడమేనన్నారు. ఈ శిబిరంలో 154 మంది రక్తదానం చేశారు. కార్యక్రమంలో అడ్మిన్ హెడ్ గణేష్‌శర్మ, కార్పొరేట్ అఫైర్స్ హెడ్ వేణుగోపాల్, మనీష్‌దావే, రాజేష్‌రంజన్, రెడ్‌క్రాస్ ప్రతినిధులు మధుసూదన్, భాస్కర్, మస్తానయ్య, సాయిరాం పాల్గొన్నారు.

నేడు హైస్కూల్ ప్లస్‌ల్లో పోస్టులకు కౌన్సెలింగ్

నెల్లూరు(టౌన్): జిల్లాలోని హైస్కూల్ ప్లస్(బాలికలు) పాఠశాలల్లో 2023-24 విద్యా సంవత్సరానికి సంబంధించి ఉపాధ్యాయ పోస్టులకు సబ్జెక్టుల వారీగా దరఖాస్తు చేసుకున్న, చేసుకునే వారికి బుధవారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సర్టిఫికెట్ వెరిఫికేషన్, కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు డీఈఓ గంగాభవాని మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు హాజరయ్యే వారు సర్వీసు రిజిస్టర్‌ను తీసుకురావాలని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఇంగ్లిష్ సబ్జెక్టు-5 పోస్టులు, తెలుగు-4, మ్యాథ్స్-2, ఫిజిక్స్-5, కెమిస్ట్రీ-3, బాటని-2, జువాలజీ-3,సివిక్స్-2, ఎకనామిక్స్-1, కామర్స్ -1 పోస్టు ఖాళీగా ఉన్నాయని, జెడ్పీ ఉన్నత పాఠశాలల్లో ఫిజిక్స్-3, సివిక్స్-4, ఎకనామిక్స్-1, కామర్స్-1 పోస్టు ఖాళీగా ఉన్నాయని తెలిపారు.

జగనన్న కాలనీలకు రుణాలు మంజూరు చేయాలి
- మెప్మా పీడీ డాక్టర్ డి.రవీంద్ర



ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం అర్హులందరికీ ఇళ్లు నిర్మించేందుకు జగనన్న కాలనీలను ఏర్పాటు చేసి ఇళ్ల స్థలాలు మంజూరు చేసిందని, వాటిలో ఇళ్లు కట్టుకునే పొదుపు మహిళలకు రుణాలు మంజూరు చేయాలని మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ డాక్టర్ డి.రవీంద్ర తెలిపారు. ఆత్మకూరులోని మున్సిపల్ ఎంజీఆర్ సమావేశ మందిరంలో కమిషనర్ బి.నాగేశ్వరరావు, మెప్మా అధికారి అంకయ్య ఆధ్వర్యంలో ఆర్పీలు, పొదుపు సంఘాల గ్రూపు లీడర్లతో మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. పొదుపు మహిళలను ప్రోత్సహించేందుకు ఒక్కొక్కరికి రూ.35 వేల రుణం మంజూరు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. హౌసింగ్ డీఈ నటరాజ్, బ్యాంకు డీసీఓ రామసుబ్బారావు, పలు బ్యాంకుల మేనేజర్లు, మెప్మా పీఓ మాధవి పాల్గొన్నారు.

స్పోర్ట్స్ స్కూల్లో ప్రవేశానికి ఎంపికలు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం, క్రీడా ప్రాధికార సంస్థ ద్వారా డాక్టర్ వైఎస్సార్ జిల్లా పుట్లంపల్లి స్పోర్ట్స్ స్కూల్లో 4, 5 తరగతుల ప్రవేశానికి మండల స్థాయిలో ఎంపికైన బాలబాలికలకు జిల్లాస్థాయిలో 23, 24వ తేదీల్లో ఎంపికలు జరుగుతాయని సెట్నెల్, డీఎస్‌ఏ సీఈఓ పుల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు అథ్లెటిక్స్ కోచ్ ఎ.రజనీకాంత్(7780590551), ఖోఖో కోచ్ కె.సుకుమార్(9390448732)లను సంప్రదించవచ్చని తెలిపారు.

యోగా ఆరోగ్యానికి మంచిదేగా..


నెల్లూరులో యోగా గురువు ప్రవీణలత ఆధ్వర్యంలో భారీ యోగా ప్రదర్శన (ఫైల్)

యోగాసనం వేస్తున్న అరుణకుమారి

యోగా పూర్వీకులు మనకిచ్చిన వారసత్వ సంపద. యోగా సాధన ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రతి ఒక్కరూ గుర్తిస్తున్నారు. యోగా గురువులు ఏర్పాటు చేసే శిక్షణ తరగతులకు హాజరై సహజ సిద్ధమైన, ఆరోగ్యకరమైన జీవన విధానం వైపు సాగుతున్నారు. యోగా దీర్ఘకాలిక రుగ్మతలను సైతం దూరం చేస్తుందని తెలుసుకుని యోగా సాధన మంచిదని ఆ మార్గంలో ప్రయాణించేందుకు ప్రయత్నిస్తున్నారు. బుధవారం అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా కథనం.

- యోగాతో ప్రశాంత జీవనం
- చిన్నతనం నుంచే సాధన చేస్తే సత్ఫలితాలు
- దీర్ఘకాలిక రుగ్మతలు దూరం
- నేడు అంతర్జాతీయ యోగా దినోత్సవం

పొదలకూరు/నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట): వయస్సుతో నిమిత్తం లేకుండా యోగా సాధన చేయడం ద్వారా ఆరోగ్యంగా జీవించవచ్చని ప్రాచీన కాలం నుంచి యోగా గురువులు చెబుతున్నారు. ఆధునిక కాలంలో మారిన జీవన విధానం వల్ల ప్రజలు పాశ్చాత్య జీవనానికి అలవాటు పడ్డారు. మన సంప్రదాయ యోగా పద్ధతులను విస్మరించి అనారోగ్యాల బారిన పడి ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల కాలంలో మన సంప్రదాయ జీవన విధానమే ఉన్నతమైనదని, యోగా సాధన ద్వారా ఆరోగ్యంగా, ఆనందంగా జీవించవచ్చని తెలుసుకుని ఆ మార్గంలో పయస్తున్నారు. నిత్యం యోగా సాధన చేస్తూ ఆరోగ్యకరమైన జీవనం వైపు అడుగులు వేస్తున్నారు. మహిళలు సైతం అధిక సంఖ్యలో యోగా వైపు ఆసక్తి చూపడం విశేషం. ఎక్కడ యోగా శిక్షణా తరగతులు నిర్వహించినా మహిళలు పురుషులకు సమానంగా హాజరవుతున్నారు. కాగా ప్రభుత్వం సైతం పాఠశాలస్థాయి నుంచే విద్యార్థులకు యోగా తరగతులను ప్రవేశ పెట్టేందుకు చర్యలు తీసుకుంటోంది. పొదలకూరు పట్టణంలో ఆరేళ్లుగా శ్రీనిర్మలానంద నిత్య యోగా సాధన కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. ప్రతినిత్యం పదుల సంఖ్యలో యోగాలో శిక్షణ తీసుకుంటున్నారు.

నిత్య యోగా కేంద్రంలో శిక్షణ

నిత్యయోగా సాధన కేంద్రంలో యోగాసాలు, ప్రాణాయామం, షట్‌క్రియలు, ధాన్యంపై శిక్షణ ఇస్తున్నారు. యోగా వల్ల శారీరక దృఢత్వం పెరిగి, ఆరోగ్య సమస్యలు దూరమవుతాయి. ప్రాణాయామం వల్ల శ్వాస నియంత్రణ చేస్తూ శరీరానికి ఆక్సిజన్ అందించి ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా చేస్తుంది. షట్‌క్రియ శరీరాన్ని ప్రత్యక్షంగా, అంతర్గతంగా శుద్ధిచేస్తుంది. యోగాలోని అర్ధకటిచక్రాసనం, పాదహస్తాసనం, అర్ధచక్రాసనం, ఉత్కంటాసనం, వృక్షాసనం తదితర ఆసనాలు వేయడం ద్వారా శారీరక దృఢత్వం పెరగడంతోపాటు దీర్ఘకాలిక రుగ్మతలు దూరమవుతాయని యోగా శిక్షకులు చెబుతున్నారు. యోగా సాధన చేయడం ద్వారా వ్యాధినిరోధక శక్తి పెంపొందుతుందని, ఒక్కొక్క వ్యాధిని ఒక్కో విధమైన ఆసనం వేయడం ద్వారా నయం చేయవచ్చని పేర్కొంటున్నారు.


యోగా కేంద్రంలో ఆసాలు వేస్తున్న మహిళలు (ఫైల్)

భావితరాలకు అందించడమే లక్ష్యం


అంతర్ జిల్లాల స్థాయి నుంచి జాతీయ స్థాయి యోగా చాంపియన్‌షిప్‌ను కై వసం చేసుకున్నాను. 7వ అంతర్జాతీయ చాంపియన్‌షిప్ అండమాన్ నికోబార్‌లో జరిగింది. అక్కడ కూడా మొదటి స్థానాన్ని సాధించాను. నేర్చుకున్న యోగాను భావితరాలకు అందించడమే లక్ష్యంగా యోగాలో శిక్షణ ఇస్తున్నా.
– అరుణకుమారి, యోగా చాంపియన్, నెల్లూరు

యోగా సాధన మంచిది


వయస్సుతో నిమిత్తం లేకుండా ప్రతి ఒక్కరూ యోగా సాధన చేయడం మంచిది. యోగా వల్ల కలిగే ప్రయోజనాలను ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలి. యోగా వల్ల దీర్ఘకాలిక రుగ్మతలు సైతం దూరమవుతాయి. మేము నిర్వహిస్తున్న యోగా కేంద్రంలో అందరికీ శిక్షణ ఇస్తున్నాం.
– సీహెచ్ పెంచలయ్య, యోగా గురువు, పొదలకూరు

యోగాలో వ్యాధి నిరోధక శక్తి


నెల్లూరు కస్తూరిదేవి హైస్కూల్లో 8వ తరగతి చదువుతున్నప్పటి నుంచి నాకు యోగాపై మక్కువ కలిగింది. మన పూర్వీకులు అందించిన యోగాలో వ్యాధినిరోధక శక్తి ఉంది. ఒక్కొక్క వ్యాధికి ఒక్కో విధమైన విన్యాసాల ద్వారా ఆ వ్యాధిని నయం చేయవచ్చు. 2016లో మాగుంట లేఅవుట్‌లో మాస్టర్స్ యోగా సెంటర్‌ను ప్రారంభించి శిక్షణ ఇస్తున్నా.
– ప్రవీణలత, యోగా శిక్షకురాలు, నెల్లూరు

ఉచితంగా శిక్షణ ఇస్తున్నా


మా నాన్న పరవాసుదేవ్ ద్వారా చిన్నప్పటి నుంచి యోగా, ధ్యానం చేయడం నేర్చుకున్నాను. 2000 సంవత్సరంలో తిరుపతిలోని మహర్షి మహేష్ యోగా భావాతీత ధ్యాన కేంద్రంలో శిక్షణ తీసుకున్నాను. ఉదయం నెల్లూరులోని టౌన్ హాలు ప్రాంగణంలో, సాయంత్రం బాలాజీ నగర్‌లో శిక్షణ ఇస్తున్నాను.
– ముత్యాల రవీంద్ర, యోగా గురువు, నెల్లూరు

‘జగనన్న ఆణిముత్యాలు’కు అవార్డులు


సీఎం చేతులమీదుగా అవార్డులు అందుకుంటున్న వైష్ణవి, మహ్మద్‌బాషా, గోకులకృష్ణారెడ్డి

నెల్లూరు(వేదాయపాళెం): పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించి రాష్ట్రస్థాయిలో ‘జగనన్న ఆణిముత్యాలు’గా ఎంపికైన జిల్లాకు చెందిన విద్యార్థులను సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభినందించారు. మంగళవారం విజయవాడలో జరిగిన ‘జగనన్న ఆణిముత్యాలు’ అవార్డుల ప్రదానోత్సవం కార్యక్రమంలో జిల్లాకు చెందిన విద్యార్థులు గోవుల గోకులకృష్ణారెడ్డి, షేక్ మహ్మద్‌బాషా, అచ్చి వైష్ణవి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతులమీదుగా ప్రతిభా పురస్కారాలు అందుకున్నారు. పదో తరగతి ఫలితాల్లో రాష్ట్రస్థాయిలో ఈ ముగ్గురూ ఉత్తమ ర్యాంకులు సాధించి సత్తాచాటారు. నెల్లూరులోని ఆంధ్రప్రదేశ్ మైనార్టీ గురుకుల పాఠశాలలో చదివిన ఎస్కే మహ్మద్‌బాషాను ఆ పాఠశాల ప్రిన్సిపల్ టి.కామేశ్వరి, ఉపాధ్యాయులు అభినందించారు. అలాగే గోకులకృష్ణారెడ్డి, వైష్ణవిలను ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు తదితరులు అభినందనలు తెలిపారు.

బయో ఎనర్జీ ప్లాంట్ల శంకుస్థాపన ఏర్పాట్ల పరిశీలన
- కంపెనీ ప్రతినిధులతో కలెక్టర్ సమీక్ష


కంపెనీ ప్రతినిధులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.హరినారాయణన్

వెంకటాచలం: మండలంలోని సర్వేపల్లిలో ఏర్పాటు కానున్న బయో ఎనర్జీ ప్లాంట్ల శంకుస్థాపన ఏర్పాట్లను మంగళవారం కలెక్టర్ ఎం.హరినారాయణన్ పరిశీలించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గురువారం బయో ఎనర్జీ ప్లాంట్లకు వర్చువల్‌గా శంకుస్థాపన చేయనున్న నేపథ్యంలో కలెక్టర్ వాటిని పరిశీలించి ఏర్పాట్లపై కంపెనీల ప్రతినిధులతో చర్చించారు. సర్వేపల్లిలో క్రిబ్కో గ్రీన్ ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ బయో ఇథనాల్ ప్లాంట్, విశ్వసముద్ర ఎనర్జీ ప్రైవేట్ లిమిటెడ్ మరో బయో ఎనర్జీ ప్లాంట్‌ను ఏర్పాటు చేయనున్నారు. ఈ ప్లాంట్లు ధాన్యం ఆధారంగా పనిచేస్తాయని, నూకలు, తడిసిన ధాన్యం, జొన్నలను ముడి పదార్థాలుగా వినియోగిస్తామని, వాటి నుంచి బయో ఇథనాల్ ఉత్పత్తి అవుతుందని క్రిబ్కో మార్కెటింగ్ మేనేజర్ వెంకటేశ్వరరావు, విశ్వసముద్ర ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిధి హేమేంద్రనాయుడు కలెక్టర్‌కు వివరించారు. రానున్న రోజుల్లో వాహనాలకు ఇంధనంగా ఈ బయో ఇథనాల్ ఉపయోగపడుతుందని తెలిపారు. దీని నుంచి వచ్చే పిప్పి నుంచి పశుదాణా, తయారు చేస్తారన్నారు. ఈ పరిశ్రమల వల్ల ఎలాంటి కాలుష్యం ఉండబోదని తెలిపారు. నిరంతరం విద్యుత్ సరఫరా ఇంటర్నెట్ కనెక్షన్, నాణ్యమైన సౌండ్ సిస్టం, స్క్రీన్స్ శిలాఫలకం ఏర్పాటు చేయాలని కలెక్టర్ కంపెనీ ప్రతినిధులకు సూచించారు. శంకుస్థాపన కార్యక్రమాలకు రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డితోపాటు స్థానిక ఎంపీ, ఇతర ప్రజాప్రతినిధులను ఆహ్వానిస్తున్నామని కంపెనీ ప్రతినిధులు కలెక్టర్‌కు వివరించారు. కార్యక్రమంలో ఆర్డీఓ మలోల, విద్యుత్‌శాఖ ఈఈ సోమశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలి

నెల్లూరు(దర్గామిట్ట): రెవెన్యూ సమస్యలపై గ్రామసభల్లో వచ్చే ప్రతి దరఖాస్తును రిజిస్టర్ చేసి నిర్దేశించిన గడువు లోపు పరిష్కరించేలా శ్రద్ధ వహించాలని కలెక్టర్ ఎం.హరినారాయణన్ రెవెన్యూశాఖ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ హాల్ నుంచి మంగళవారం ఆర్డీఓలు, తహసీల్దార్లతో కలెక్టర్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లాలో జరుగుతున్న రీ సర్వే, మ్యూటేషన్, స్పందన, జగనన్నకు చెబుదాం కార్యక్రమాల పురోగతి, చుక్కల భూములు, అసైన్‌మెంట్ భూముల ప్రతిపాదనలు తదితర రెవెన్యూ అంశాలపై మండలాల వారీగా సమీక్షించి పలు సూచనలు, ఆదేశాలు ఇచ్చారు. రీ సర్వే ప్రక్రియ మొదలైనప్పటి నుంచి భూహక్కు పత్రాలు ఇచ్చేవరకు జాగ్రత్త వహించాలని తెలిపారు. ‘గడప గడపకు మన ప్రభుత్వం’ కార్యక్రమంలో వచ్చిన రెవెన్యూ సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో వెంకటనారాయణమ్మ, సర్వే ల్యాండ్ రికార్డు ఏడి హనుమాన్ ప్రసాద్, ఏఓ షఫీమాలిక్, జేసీ కూర్మనాథ్, కందుకూరు సబ్ కలెక్టర్ శోభిక, కావలి, ఆత్మకూరు, నెల్లూరు ఆర్డీఓలు శీనానాయక్, కరుణకుమారి, మలోల, తహసీల్దార్లు పాల్గొన్నారు.

క్లుప్తంగా

నేటి నుంచి ఉచిత శిక్షణ

నెల్లూరు(సెంట్రల్): నేటి నుంచి నాలుగురోజులపాటు నాణ్యమైన ఆహారాన్ని తయారు చేయడం ఎలా? అనే అంశంపై ఉచితంగా శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఫుడ్ సేఫ్టీ కంట్రోలర్ జి.వెంకటేశ్వర్లు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేందుకు ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామన్నారు. కలెక్టర్ కార్యాలయం సమీపంలోని డీఆర్‌డీఏ కార్యాలయం వద్ద రోజూ 100 మందికి శిక్షణ ఇస్తామని తెలియజేశారు.

గాయపడిన వ్యక్తి మృతి



ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): కారు ఢీకొన్న ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన వ్యక్తి మంగళవారం మృతిచెందాడు. పోలీసుల కథనం మేరకు.. హారిక రమణారెడ్డి (70) అనే వ్యక్తి సోమవారం మర్రిపాడు మండలంలోని ఇస్కపల్లి వద్ద కల్వర్టుపై కూర్చొని ఉండగా అటుగా వెళ్తున్న కారు ఢీకొనడంతో కాలు విరిగి తీవ్రంగా గాయపడిన విషయం తెలిసిందే. క్షతగాత్రుడిని బంధువులు తొలుత మర్రిపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం నెల్లూరు, అక్కడి నుంచి తిరుపతికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ రమణారెడ్డి మృతి చెందినట్లు మర్రిపాడు ఎస్సై తెలిపారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య



లలిత (ఫైల్)

అల్లూరు: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య చేసుకున్న ఘటన అల్లూరు నగర పంచాయతీ పరిధిలోని సింగపేట గ్రామంలో మంగళవారం జరిగింది. స్థానిక ఎస్సై పి.శ్రీనివాసులురెడ్డి కథనం మేరకు.. సింగపేటకు చెందిన జడ లలిత (30)కు వివాహమైంది. ముగ్గురు పిల్లలు ఉన్నారు. కాగా ఏడాదిన్నగా ఆమె భర్త నుంచి దూరంగా ఉంది. తన తల్లిదండ్రుల వద్ద ఉంటూ అల్లూరులోని ఓ మొబైల్ షాపులో పనిచేస్తోంది. సోమవారం రాత్రి పనికి వెళ్లొచ్చి భోజనం చేసి ఇంట్లో నిద్రిపోయింది. మంగళవారం తెల్లవారుజామున తండ్రి నిద్ర లేచి తలుపు తట్టగా ఎంతకూ తీయకపోవడంతో కిటికీలో నుంచి చూశాడు. కుమార్తె ఫ్యాన్‌కు ఉరేసుకుని ఉండడంతో చుట్టుపక్కల వారి సాయంతో తలుపులు పగులగొట్టి ఆమెను కిందకు దించారు. మృతికి గల కారణాలు తెలియాల్సి ఉంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

తీరు మారాలి.. పద్ధతిగా ఉండాలి

- లైంగికదాడి కేసులో పోలీసుల లోతైన దర్యాప్తు
- నిందితులంతా యువకులే..
- వారిలో ఐదుగురు రౌడీషీటర్లు
- కఠిన చర్యలకు రంగం సిద్ధం
- నేరాల కట్టడికి ప్రత్యేక చర్యలు



లైంగికదాడి కేసులో ఇటీవల నిందితులను పట్టుకుని వివరాలను వెల్లడిస్తున్న నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

నెల్లూరు(క్రైమ్): రౌడీషీటర్లు, పాతనేరస్తులు పద్ధతి మార్చుకుని సమాజంలో గౌరవప్రదంగా జీవించాలని పోలీసు అధికారులు పదే పదే హెచ్చరిస్తున్నా కొందరిలో మార్పు రావడం లేదు. నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. ఇటీవల ఓ యువతిపై లైంగికదాడి కేసులో నిందితుల్లో ఐదుగురిపై రౌడీషీట్ ఉన్నట్లు గుర్తించారు. ఈ నేపథ్యంలో ఉన్నతాధికారులు నేరాల కట్టడికి కఠిన చర్యలు తీసుకుంటున్నారు.

ఆ కేసులో..

యువతిపై లైంగికదాడి కేసును పోలీసులు లోతుగా దర్యాప్తు చేయగా అనేక విషయాలు వెలుగులోకి వచ్చాయి. వారు వెల్లడించిన వివరాల మేరకు.. నిందితులంతా యువకులే. 19 ఏళ్ల నుంచి 25 ఏళ్లోపు వారే. హరనాథపురానికి చెందిన భాను విష్ణువర్ధన్ అలియాస్ లడ్డ సాయి, భానుసాయి వర్ధన్ అన్నదమ్ములు. వీరిపై హత్య కేసులు, ఇంకా బాలాజీనగర్ పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్లు ఉన్నాయి. గతంలో బాలాజీనగర్‌లో ఓ వాచ్‌మెన్‌ను హత్య చేశారు. ఫిబ్రవరిలో నగరంలోని ఉడ్‌హౌస్‌సంఘంలో బి.మహేష్ బాబు హత్య కేసులో భాను విష్ణువర్ధన్ నిందితుడు. నవాబుపేట పోలీసులు అతడిని అరెస్ట్ చేసి జైలుకు పంపారు. తాజాగా లైంగికదాడి కేసులో అన్నదమ్ములను వేదాయపాళెం పోలీసులు అరెస్ట్ చేశారు. బుజబుజనెల్లూరుకు చెందిన సాయి జగదీష్ అలియాస్ డియో సాయి, ఎ.సుజన్‌కృష్ణ అలియాస్ చింటూ, లడ్డ సాయి, మరికొందరు స్నేహితులుగా ఉన్నారు. అందరూ కలిసి ఉడ్‌హౌస్‌సంఘంలో మహేష్‌బాబు అనే యువకుడిని హత్య చేశారు. దీంతో డియో సాయి, చింటూపై నవాబుపేట పోలీసులు రౌడీషీట్లు తెరిచారు. ఇటీవలే వారు జైలు నుంచి బయటకు వచ్చారు. బుజబుజనెల్లూరుకు చెందిన హుస్సేన్‌బాషా ఐటీఐ వరకు చదువుకుని కొయ్య పనిచేస్తున్నాడు. అతడిపై దగదర్తి పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. వెంకటరెడ్డినగర్‌కు చెందిన యుగంధర్‌పై పోక్సో, దాడి కేసులున్నాయి. శోధన్‌నగర్‌కు చెందిన ఎం.సాయిసాత్విక్, గోమతినగర్‌కు చెందిన కె.అజయ్ బీటెక్ విద్యార్థులు. ముత్యాలపాళేనికి చెందిన రేవంత్ డిగ్రీ చదువుతున్నాడు. కాగా రౌడీషీటర్లు పలుమార్లు జైలుకు వెళ్లి వచ్చినా తీరులో మార్పురాలేదు. లైంగికదాడి కేసు నేపథ్యంలో వారిపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసులు రంగం సిద్ధం చేస్తున్నారు.

ఇప్పటికే..

తీరు మారని రౌడీషీటర్లు, పాత నేరస్తులపై ఉక్కుపాదం మోపేందుకు పోలీసు అధికారులు పీడీ యాక్ట్ ప్రయోగిస్తున్నారు. ఇప్పటికే ఎనిమిది మంది రౌడీషీటర్లు, ముగ్గురు నాటుసారా తయారీదారులు, ఐదుగురు గంజాయి విక్రయించే వారిపై ఈ యాక్ట్ పెట్టారు. దీంతో కొందరు రౌడీషీటర్లు పద్ధతిగా జీవిస్తుండగా కొందరు మాత్రం నేరాలకు పాల్పడుతూనే ఉన్నారు. తాజాగా యువతిపై లైంగికదాడి కేసులో పట్టుబడిన ఐదుగురు రౌడీషీటర్లు తీరు అలానే ఉండడంతో ఎస్పీ డాక్టర్ కె.తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు వారిపై కఠిన చర్యలకు పోలీసు అధికారులు రంగం సిద్ధం చేస్తున్నట్లు సమాచారం. త్వరలో వారిపై సైతం పీడీ యాక్ట్ ప్రయోగించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఏది ఏమైనా నేరస్తులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని అవసరమైతే పీడీ యాక్ట్ పెట్టేందుకు, జిల్లా బహిష్కరణకు వెనుకాడబోమని పోలీసు అధికారులు హెచ్చరిస్తున్నారు. జిల్లాను ప్రశాంతంగా ఉంచేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నామని స్పష్టం చేస్తున్నారు.

రవాణా శాఖ అధికారుల దాడులు



బైక్‌లను సీజ్ చేసిన అధికారులు

నెల్లూరు(టౌన్): అనధికార షోరూంల్లో బైక్‌లు విక్రయిస్తున్నారన్న ఫిర్యాదులపై రవాణా శాఖ అధికారులు స్పందించారు. జిల్లాలో రవాణా శాఖ అనుమతి లేకుండా ద్విచక్ర వాహనాలను అనధికారికంగా విక్రయిస్తున్న పలు షోరూంలపై ఉప రవాణా కమిషనర్ బి.చందర్ ఆదేశాలతో మంగళవారం దాడులు చేశారు. తిరుపతిలో డీలర్‌షిప్ ఉండి నెల్లూరు మినీ బైపాస్‌లో అనధికార షోరూములు ఏర్పాటు చేసి దొంగ బిల్లులతో బైకులను విక్రయిస్తున్నట్లు గుర్తించారు. మొత్తం 29 బైక్‌లను సీజ్ చేశారు. వాటి చాయిస్, ఇంజిన్ నంబర్లను రాష్ట్ర రవాణా శాఖ కమిషనర్‌కు పంపించనున్నారు. దాడులు చేసిన వారిలో ఎంవీఐ కార్తీక్ పవన్, ఏఎంవీఐలు పూర్ణచంద్రరావు, స్వప్నీల్‌రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

'నాకు చనిపోవాలని ఉంది'

- భార్యకు ఫోన్ చేసి చెప్పిన భర్త
- అప్పులు తీర్చలేక వ్యక్తి బలవన్మరణం



సునీల్ మృతదేహం

నెల్లూరు(క్రైమ్): ఓ వ్యక్తి మద్యానికి బానిసయ్యాడు. తాగేందుకు అప్పులు చేశాడు. వాటిని తీర్చలేక ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ ఘటన నెల్లూరు ఎఫ్‌సీఐ కాలనీలో మంగళవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు.. నవాబుపేట పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఎఫ్‌సీఐ కాలనీలో జి.సునీల్ (26), శ్రావణి దంపతులు ఉంటున్నారు. వారు మూడేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఒక కుమారుడు ఉన్నాడు. సునీల్ పూల అంగట్లో పనిచేసేవాడు. మద్యానికి బానిసైన అతను కొంతకాలంగా పనికి వెళ్లడంలేదు. అప్పులు చేసి మద్యం తాగేవాడు. తీసుకున్న అప్పులు తీర్చలేక రెండుసార్లు చేతులు కోసుకుని ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టాడు. కుటుంబసభ్యులు సకాలంలో చికిత్స చేయించడంతో ప్రాణాపాయం నుంచి బయటపడ్డాడు. పరిస్థితులు చక్కబడతాయని సునీల్‌కు అతని తల్లి రాములమ్మ సూచించింది. అయినా తీవ్ర మనస్తాపానికి లోనవుతూనే ఉన్నాడు. ఈ నేపథ్యంలో మంగళవారం సునీల్ భార్యను ఆమె పుట్టింట్లో వదిలిపెట్టాడు. అనంతరం మందు తాగుతున్నానని, తనకు చనిపోవాలని ఉందని ఆమెకు ఫోన్ చేసి చెప్పాడు. దీంతో ఆమె సునీల్ స్నేహితుడు వంశీకి ఫోన్ చేసి ఈ విషయాన్ని తెలియజేసింది. అతను, రాములమ్మ అందరూ కలిసి సునీల్ ఇంటికి వెళ్లి చూడగా అప్పటికే అతను ఫ్యాన్‌కు చీరతో ఉరేసుకుని ఉన్నాడు. చుట్టుపక్కల వారి సహాయంతో అతడిని నగరంలోని ఓ ప్రైవేట్ హాస్పిటల్‌కు తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే సునీల్ మృతిచెందాడని నిర్ధారించారు. ఈ మేరకు బాధిత తల్లి నవాబుపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇన్‌స్పెక్టర్ టీవీ సుబ్బారావు, ఎస్సై కె.తిరుపతయ్య హాస్పిటల్‌కు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఎస్సై కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాలం చెల్లిన స్తంభాలు మార్చేందుకు చర్యలు



ఎమ్మెల్యే రామిరెడ్డితో మాట్లాడుతున్న సీఎండీ సంతోష్‌బాబు

- ఏపీ ఎస్పీడీసీఎల్ సీఎండీ సంతోష్‌బాబు

కావలి: ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా కాలం చెల్లిన విద్యుత్ స్తంభాలు, తీగలు మార్చేందుకు చర్యలు తీసుకున్నామని, ఇందుకోసం రూ.20 కోట్లు వెచ్చిస్తున్నట్లు ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కె.సంతోష్‌బాబు తెలిపారు. పట్టణంలోని విట్స్ కళాశాలలో ట్రాన్స్‌కో డివిజన్ స్థాయి అధికారులతో మంగళవారం ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు విద్యుత్ కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే 30 రోజుల్లోగా మంజూరు చేయాలని, జాప్యం చేస్తే సంబంధిత అధికారులపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వినియోగదారులకు సేవలందించడంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరించినా, దురుసుగా సమాధానం చెప్పినా ఉపేక్షించేది లేదన్నారు. ఫోన్‌లో ఫిర్యాదు చేసినా వెంటనే స్పందించి తగిన చర్యలు చేపట్టాలని సూచించారు. రైతులతో దురుసుగా ప్రవర్తించినా, నిర్లక్ష్యంగా వ్యవహరించినట్లు ఫిర్యాదులొచ్చినా చర్యలు తప్పవన్నారు. బకాయిల వసూళ్లలో ప్రత్యేక చొరవ చూపాలన్నారు. కార్యక్రమంలో చీఫ్ జనరల్ మేనేజర్లు గురవయ్య, కేఆర్‌ఎస్ ధర్మజ్ఞాని, నెల్లూరు సర్కిల్ ఎస్ఈ వెంకటసుబ్బయ్య, ఈఈలు విజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్, బెనర్జీ తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన సీఎండీ

సీఎండీ సంతోష్‌బాబు ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డిని మర్యాదపూర్వకంగా పట్టణంలోని ఎమ్మెల్యే నివాసంలో కలిశారు. నియోజకవర్గంలోని విద్యుత్ సంబంధిత సమస్యలను ఎమ్మెల్యే సీఎండీ దృష్టికి తీసుకెళ్లారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో భాగంగా ప్రజలు తీసుకొచ్చిన విద్యుత్ సంబంధిత సమస్యలు, పరిష్కార మార్గాలపై చర్చించారు. ప్రధానంగా తీర ప్రాంత గ్రామాల్లో కండక్టర్స్ తుప్పు పట్టి ప్రమాదాలు జరిగేలా ఉండడంతో పాతవాటి స్థానంలో కొత్తవి ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేయగా సీఎండీ సానుకూలంగా స్పందించారు.

జగదేవిపేటలో చోరీ

ఇందుకూరుపేట: ఓ ఇంట్లోకి చొరబడి రూ.50 వేలు విలువైన వెండి వస్తువులను చోరీ చేశారు. పోలీసుల కథనం మేరకు.. జగదేవిపేట ప్రాంతానికి చెందిన పాంగూరు వెంకట నారాయణరెడ్డి కొంతకాలంగా హైదరాబాద్‌లో ఉంటున్నారు. ఈ నేపథ్యంలో అదే గ్రామానికి చెందిన పి.శ్రీనివాసులు ఆయన ఇంటికి కాపలాగా ఉంటున్నాడు. రోజులాగానే సోమవారం రాత్రి పని ముగించుకుని శ్రీనివాసులు తన సొంతింటికి వెళ్లాడు. మంగళవారం ఉదయం వచ్చి చూసేసరికి వెంకట నారాయణరెడ్డి ఇంటి తలుపులు పగులగొట్టి ఉన్నాయి. దేవుడి గదిలోని వెండి వస్తువులు కనిపించలేదు. దీంతో చోరీ జరిగినట్లు గుర్తించిన శ్రీనివాసులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

నిమ్మధరలు (కిలో)

పెద్దవి	: రూ.34
సన్నవి	: రూ.20
పండ్లు	: రూ.7



నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు



బ్రాయిలర్ (లైవ్)	: 176
లేయర్ (లైవ్)	: 108
బ్రాయిలర్ చికెన్	: 296
బ్రాయిలర్ స్కిన్‌లెస్	: 326
లేయర్ చికెన్	: 184

ఇద్దరు దొంగల అరెస్ట్




మాట్లాడుతున్న డీఎస్పీ వీరాంజనేయరెడ్డి, చిత్రంలో సీఐ వేమారెడ్డి, ఎస్సై శివకృష్ణారెడ్డి

- 27 సవర్ల బంగారు ఆభరణాల స్వాధీనం

ముత్తుకూరు: దురలవాట్లకు బానిసై పలుచోట్ల చోరీలకు పాల్పడిన ఇద్దరు దొంగలను ముత్తుకూరు పోలీసులు మంగళవారం అరెస్ట్ చేశారు. నెల్లూరు రూరల్ డీఎస్పీ పి.వీరాంజనేయరెడ్డి, కృష్ణపట్నం సీఐ కె.వేమారెడ్డి, ముత్తుకూరు ఎస్సై శివకృష్ణారెడ్డి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో వివరాలు వెల్లడించారు. నెల్లూరు బోడిగాడితోటకు చెందిన పాత నేరస్తుడు మీదూరు సునీల్ జిల్లాలోని పలు ప్రాంతాల్లో చోరీలకు పాల్పడ్డాడు. జైలు శిక్ష అనుభవించి ఇటీవల బయటకు వచ్చాడు. సునీల్ బోడిగాడితోటకు చెందిన దేవరపల్లి సురేష్‌తో కలిసి చెడు అలవాట్లకు బానిసయ్యాడు. ఇద్దరూ చోరీలకు పాల్పడడం మొదలుపెట్టారు. రాత్రి వేళల్లో తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకున్నారు. ముత్తుకూరు మండలంలోని మల్లూరులో మూడు చోట్ల, మధురానగర్, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, నెల్లూరు రూరల్ మండలంలోని నారాయణరెడ్డిపేటలో చోరీలకు పాల్పడి, బంగారు ఆభరణాలు, వెండి సామగ్రి, బైక్ అపహరించుకెళ్లారు. ఎస్పీ తిరుమలేశ్వరరెడ్డి ఆదేశాలతో, డీఎస్పీ సూచనల మేరకు ప్రత్యేక బృందంగా ఏర్పడిన పోలీసులు మంగళవారం మల్లూరు కూడలి వద్ద నిందితులను పట్టుకున్నారు. వారి నుంచి రూ.15 లక్షల విలువ చేసే 27.5 సవర్ల బంగారు ఆభరణాలు, 2 కిలోల వెండి సామగ్రి, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులను పట్టుకోవడంలో ప్రతిభ చూపిన హెడ్‌కానిస్టేబుల్ పెంచలయ్య, సుధాకర్, శ్రీనివాసులు, కానిస్టేబుళ్లు వెంకటరమణ, వెంకటేశ్వర్లు, నాగార్జున, సుమన్, పెంచలయ్యకు డీఎస్పీ రివార్డులు అందజేశారు.

మృతుడి ఆచూకీ లభ్యం

- నెల్లూరుకు చెందిన మాసుమ్‌గా గుర్తింపు?



మాసుమ్ (ఫైల్)

మనుబోలు: మండలంలోని కొండూరుసత్రం సమీపంలోని ఇండియన్ పెట్రోల్ బంకు పక్కన ఉన్న పొలాల్లో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహాన్ని స్థానికులు సోమవారం గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చిన విషయం తెలిసిందే. ఇతడిని నెల్లూరుకు చెందిన షేక్.మాసుమ్‌గా గుర్తించారు. పత్రికల్లో మంగళవారం వచ్చిన వార్త ఆధారంగా బంధువులు మనుబోలుకు చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. ఆనవాళ్లను బట్టి తమ బంధువు మాసుమ్ అని తెలిపారు. నెల్లూరు డైకస్ రోడ్డుకు చెందిన ఎస్‌కే మాసుమ్ కూలి పనులు చేసుకుంటూ జీవించేవాడు. కాగా రెండు వారాల క్రితం అదే ప్రాంతానికి చెందిన లారీ డ్రైవర్ అంకయ్య తనతోపాటు క్లీనర్‌గా మాసుమ్‌ను తీసుకెళ్లాడని బంధువులు తెలిపారు. అయితే వారం క్రితం అంకయ్య ఒక్కడే ఇంటికి చేరుకున్నాడని, మాసుమ్ గురించి అడిగితే పొంతన లేని సమాధానాలు చెప్పాడన్నారు. మాసుమ్ కనిపించడం లేదని నెల్లూరులో పోలీసులకు ఫిర్యాదు కూడా చేశామని తెలిపారు. ఎవరో కొట్టి చంపారని బంధువులు ఆరోపిస్తున్నారు. అయితే మృతదేహం మాసుమ్‌దేనని పోలీసులు ఇంకా ధ్రువీకరించలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

సంగం: పురుగు మందు తాగి నెల్లూరు వైద్యశాలలో చికిత్స పొందుతున్న యువకుడు మృత్యువాత పడిన ఘటన మండలంలోని కోలగట్లలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. మండలంలోని కోలగట్ల గ్రామానికి చెందిన మస్తాన్‌వలీ రెండో కుమారుడు రియాజ్ (22) కాంక్రీట్ మిక్సర్ ఆపరేటర్‌గా పనిచేస్తున్నాడు. వారం రోజుల క్రితం మోటార్‌బైక్ కొనివ్వాలని తన తండ్రిని అడిగాడు. కొద్దిరోజుల తర్వాత తీసుకుందామని మస్తాన్‌వలీ చెప్పడంతో మనస్తాపానికి గురైన రియాజ్ ఆదివారం పురుగు మందు తాగాడు. గమనించిన కుటుంబసభ్యులు అతడిని నెల్లూరులోని ఓ వైద్యశాలకు తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మంగళవారం పోస్టుమార్టం అనంతరం రియాజ్ మృతదేహాన్ని కుటుంబసభ్యులకు పోలీసులు అప్పగించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నాగార్జునరెడ్డి తెలిపారు.